క్లుప్తంగా

గొర్రెలకు నీలినాలుక టీకాలు పంపిణీ



పెబ్బేరు: మండలంలో వైశాఖాపూర్ గ్రామంలో పశువైద్య అధికారులు శుక్రవారం గొర్రెలకు నీలినాలుక టీకాలను వేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బాల్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో వాతావరణం మార్పుల వల్ల గొర్రెలు పచ్చిగడ్డి తిని రోగాల బారిన పడుతుంటాయని, ప్రభుత్వం ఉచితంగా గొర్రెలకు నీలినాలుక టీకాలు పంపిణీ చేస్తుందని ఈ అవకాశాన్ని గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొర్రెల కాపర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఉప సర్పంచ్ ఎల్లయ్య, నాగరాజు, చంద్రన్న, తిరుపతయ్య, మోహన్‌రెడ్డి వెటర్నరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వసతులు కల్పించండి



ఆత్మకూర్: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో తిష్టవేసిన సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం పుర కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. డిగ్రీ కళాశాలకు కంపౌండ్ లేదని, అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, తాగునీటి సౌకర్యం లేదని, కళాశాలలోకి వెళ్లేందుకు కనీసం మెట్లు కూడా నిర్మించలేదని అసహనం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని కమిషనర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో రమేష్, భాను, ప్రణయ్, అనిల్ ఉన్నారు.

హరితహారానికి సర్వం సిద్ధం



అమరచింత: హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో గుంతలను తవ్వించే పనులను వేగవంతం చేశామని ఏపీఓ బాలయ్య తెలిపారు. ముసురు వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు అనువుగా ఉండడంతో గ్రామాల్లో గుంతలను తవ్విస్తున్నామన్నారు. గ్రామానికి పదివేల మొక్కల సామర్థ్యం గల నర్సరీ ఏర్పాటు చేశామని, వీటిలోని మొక్కలను ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ప్రార్థన మందిరాల వద్ద గల ఖాళీ స్థలాల్లో నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



వనపర్తి టౌన్: మొహర్రం తొలి రోజు జిల్లా కేంద్రంలోని పీర్ల గుట్టలో ప్రతిష్ఠించిన ఇమామ్ హుస్సేన్ పీర్‌ను మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... త్యాగానికి ప్రతీక మొహర్రం అని, ధర్మం కోసం యుద్ధం చేసి అమరులైన హుస్సేన్‌ల త్యాగాన్ని స్మరించుకోవడం కోసమే మొహర్రం అని చెప్పారు. ధర్మానికి, న్యాయానికి కట్టుబడి ఉన్న వాళ్ల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు.

నీట్ ర్యాంకర్లకు సన్మానం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామానికి చెందిన పావని, హరికృష్ణ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. శుక్రవారం వారిని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ వారి బృందంతో కలిసి వారి స్వగృహంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టపడి చదివితే సాధించనది ఏది లేదన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్, రాములు, వెంకటయ్య, సుధాకర్, శ్రీనివాసులు, అనిల్, శేఖర్, తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బజారన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్యంపై పట్టింపేది?

- పాఠశాలల సమీపంలో మురుగు నిల్వలు
- విద్యార్థులు అనారోగ్యం పాలైనా పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



పాంరెడ్డిపల్లి కేజీబీవీ వెనక ఇలా..



పాన్‌గల్ కస్తూర్బా సమీపంలో నిలిచిన మురుగు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లి శివారులో గల కేజీబీవీ పాఠశాల వెనకాల మురుగు నిల్వ ఉండటంతో పరిసరాలు దుర్గంధంగా తయారయ్యాయి. పది రోజుల కిందట పాఠశాలకు చెందిన విద్యార్థినులు కలుషిత ఆహారం తిని 70 మంది తీవ్ర అస్వస్థతకు గురైనా సంబంధిత అధికారులు పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు కొనసాగుతున్న కేజీబీవీలో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ వెళ్తున్న ప్రదేశంలో మురుగునీరు నిల్వ ఉండటంతో ఎప్పుడు ఎలాంటి విష జ్వరాలు వస్తాయో అన్న భయంతో పాఠశాల విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిల్వ ఉన్న మురుగును తొలగించాలని కోరుతున్నారు.

'కస్తూర్బా' పరిసరాల్లో దుర్గంధం

పాన్‌గల్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయం పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థినులు, పరిసరాల గృహ యజమానులు వాపోతున్నారు. విద్యాలయం నుంచి వచ్చే మురుగు నీరు వెళ్లేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో అక్కడే నిల్వ ఉండి దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. దీనికి తోడు ముసురు వర్షాలు కూడా తోడవడంతో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ రోగాలు సంభవిస్తాయోనని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగు సక్రమంగా ప్రవహించేలా తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరుతున్నారు.

స్వీపర్ల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గోపాలకృష్ణ

పాన్‌గల్: స్వీపర్ల డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాసన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో రిలే దీక్షలు చేస్తున్న స్వీపర్లకు వారు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీపర్లు తమ సమస్యల పరిష్కారం కోసం పది రోజులుగా దీక్షలు చేస్తున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లలో కొందరికి రూ. 1,623, మరికొందరికి రూ. 4 వేల జీతం ఇస్తున్నారని వారు పేర్కొన్నారు. ఆసరా పింఛన్ వృద్ధులకు రూ. 2వేలు, దివ్యాంగులకు రూ.4 వేలు ఇస్తున్న ప్రభుత్వం కష్టపడి పనిచేసే స్వీపర్లకు ఇచ్చే వేతనాలు వారికంటే చాలా తక్కువగా ఉన్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వీపర్ల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రాము, ఖయ్యూం, రషీద్, వెంకటయ్య, ముస్తాఫా, ముకుంద, శోభారాణి, అక్కమ్మ, నాగమ్మ, సాయమ్మ పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ఏర్పాటుకు పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

వీపనగండ్ల: మండల కేంద్రానికి మంజూరైన ఎస్సీ గురుకుల కాలేజీ వసతులు లేవన్న కారణం చేత కొత్తకోట పట్టణంలో కొనసాగుతుంది. ఇటీవలే కాలేజీలో విద్యార్థి పాముకాటుకు గురైన ఘటన నేపథ్యంలో తిరిగి ఆ కాలేజీని మండల కేంద్రంలోనే నెలకొల్పేందుకు శుక్రవారం ఎంపీపీ కమలేశ్వర్‌రావుతో పాటు పలువురు అధికారులు వసతులను పరిశీలించారు. మండల కేంద్రంలో గతంలో ఉన్న ఎస్సీ గురుకుల పాఠశాలను కూడా కొత్తకోటలోనే కొనసాగిస్తున్నారు. అందుకు అప్‌గ్రేడ్‌గా గతేడాది ఇంటర్ కాలేజీ తరగతులను కూడా అక్కడే బోధిస్తున్నారు. ఎన్నో రోజులుగా మండలంలోని ప్రజాప్రతినిధులు వీపనగండ్లలో స్కూల్, కాలేజీని కూడా కొనసాగించాలని కోరినా జిల్లా అధికారులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఈడబ్ల్యూఐడీసీ డీఈ శ్రీనివాసులు, ఏఈలు సంతోష్, కవిరెడ్డి మండల కేంద్రంలోని బీసీ పాఠశాలలో కళాశాల నెలకొల్పాలని, అందుకు అవసరమైన వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, షాలిపాష, రజాక్ పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న షిమియాసోన్

కొత్తకోట: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అమానవీయ ఘటనకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు షిమియాసోన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మణిపూర్‌లో రాష్ట్రంలో జరిగిన హింసా కాండను వ్యతిరేకిస్తూ క్రైస్తవ సామాజిక పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కేఎస్‌పీవీ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానవీయ ఘటనలు యావత్ భారతదేశాన్ని కలచి వేశాయని, దేశం మొత్తం ముక్త కంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు నతానియల్, సుందర్, ఆశీర్వాదం, దావీద్, లాజర్, జాన్‌మార్క్, చంద్రబాబు, సంజీవయ్య, శాంతి ప్రసాద్, జేపీ పాల విలియం, బాబు ఉన్నారు.

ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి

కొల్లాపూర్: అల్లర్లకు, హింసకు కేంద్రంగా మారిన మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కేఎల్ఐ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన గిరిజన సంఘం నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ, గిరిజనులు హత్యలకు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, తిరుపతి, నరసింహ్మ, బాలు నాయక్ తదితరులున్నారు.

పెంట్లవెల్లి: మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగింపుపై ఐద్వా, సీఐటీయూ, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఈ సందర్భంగా దోషులను వెంటనే గుర్తించి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఈశ్వర్, పలు సంఘాలు మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: ఉపాధిహామీ పథకం ద్వారా 2023–24 సంవత్సరానికి సంబంధించి పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, మునగ, సపోట, బత్తాయి, పనస, నేరుడు, ఆపిల్‌బేర్, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, సీతాఫలం మొదలైన తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ఉపాధిహామీ జాబు కార్డు, అనువైన భూమి, నీటి సౌకర్యం కలిగి ఉండి 5 ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓ, ఏఈఓను సంప్రదించాలన్నారు.

బస్సు, ఆటో ఢీ: కేసు నమోదు


ఖిల్లాఘనపురం: మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ఆటోను అజాగ్రత్తగా నడుపుతు ఆర్టీసీ బస్సుకు ఢీ కొట్టిన ఘటన మండల కేంద్రం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మహబూబ్‌నగర్ నుంచి ఖిల్లాఘనపురం మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్తుంది. మండల కేంద్రానికి సమీపంలోని శ్రీవెంకటేశ్వర రైస్‌మిల్ వద్ద ఎదురుగా వస్తున్న భూత్‌పూర్ మండలం గిరిజనతండాకు చెందిన రాజు మద్యం సేవించి తన ఆటోను అజాగ్రత్తగా నడుపుతూ బస్సును ఢీ కొట్టాడు. ఈ విషయమై బస్సు డ్రైవర్ శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సులోని ప్రయాణికులతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శ్రీహరి ఆటో డ్రైవర్ రాజుపై కేసు నమోదు చేశారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని రాచాలకు చెందిన ఉప్పరి అశోక్‌కుమార్ ఈనెల 10న ఇంట్లో పాము కాటు వేయడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు వదిలాడు. మృతునికి భార్య లత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబానికి సొంత ఇల్లు, భూమి లేకపోవడంతో 1999–2000 చెందిన అశోక్ పదో తరగతి పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. రూ.65వేలను పోగు చేసి ఇందులో రూ.10వేల నగదును భార్యకు శుక్రవారం అందజేశారు. మిగిలిన రూ.55వేలను కుమార్తె పేరున బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు వారు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని వారు కోరారు. ఉపసర్పంచ్ ఖాజమైనోద్దీన్, రామస్వామి, నాగరాజు, ఆర్యరమేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.



కొర్లకుంటలో 4 ఇళ్లల్లో చోరీకి యత్నం



గోపాల్‌నాయక్ ఇంట్లో వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు

వీపనగండ్ల: మండలంలోని కొర్లకుంటలో గురువారం అర్ధరాత్రి 4 ఇళ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామానికి చెందిన గోపాల్‌నాయక్, ఖాజామియా, నర్సింహ, ముడావత్ శంకర్ ఇళ్లల్లో అర్ధరాత్రి వేళ చోరీకి ప్రయత్నించిన వ్యక్తులు ఇంట్లోని సామన్లను చిందరవందరగా పడేశారు. ముడావత్ శంకర్ ఇంటి సమీపంలోని హోటల్‌లో రూ.5వేల నగదుతో పాటు రూ.3వేల విలువ చేసే సిగరెట్ డబ్బాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ సోదరుడు శ్రీనివాస్(60) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ కోటేష్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు మండ్ల రామకృష్ణ, చెన్నయ్య, పోషన్న, యాదమ్మ, నాయకులు గడ్డమీది శ్రీను, రియాజ్‌అలీ, అనిల్, శివ, గోపన్‌పేట సర్పంచ్ అంజనేయులు ఉన్నారు.

ముసురు వానకు కూలిన ఇళ్లు



కూలిన ఇంటి వద్ద ఎల్లమ్మను పంచాయతీ కార్యాలయానికి తరలిస్తున్న సర్పంచ్ శివాజీ



కూలిన ఇంటిని చూపుతున్న బాధితుడు

ఆత్మకూర్: కొన్ని రోజులుగా కురుస్తున్న ముసురు వానతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పాత ఇళ్లు వర్షానికి మెత్తబడి కూలిపోతున్నాయి. మండలంలోని దేవరపల్లిలో శుక్రవారం సాయంత్రం నాలుగు ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన నర్సింహ బతుకుదెరువు కోసం భార్యపిల్లలతో హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. దీంతో తన తల్లి ఎల్లమ్మ మాత్రమే ఇంట్లో నివసిస్తుంది. సాయంత్రం ఒక్కసారిగా ఇల్లు ఒక పక్క పడిపోవడంతో గమనించిన గ్రామస్తులు ఎల్లమ్మను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాందాసు, జీవరత్నం, నాగన్న నివాస గృహాలు కూలిపోయాయి. నిరాశ్రులైన కుటుంబాలకు పంచాయతీ కార్యాలయంలో వసతి కల్పించామని, ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేసి బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ శివాజీ కోరారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం



నిల్వ నీటిలో లార్వా నివారణ మందును చల్లుతున్న ఆశా కార్యకర్తలు

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించారు. డ్రై డేలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కాలనీల్లో పర్యటించి పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటిని పారబోసుకొని నూతన నీటిని పట్టుకోవాలని, తాగునీటిని కాచి వడ బోసుకొని తాగాలని, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. నిల్వ నీటిలో లార్వా నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు రేణుక, కవిత, సరస్వతి, అలివేలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య వైద్య సిబ్బంది

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

బిజినేపల్లి: వాతావరణ మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాజేశ్వర్, గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం వసతి గృహాల్లో, పాఠశాల్లో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, జాండీస్, అతిసార తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో గజవర్ధనమ్మ, యాదయ్య, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి వినతి



డీఈఓ గోవిందరాజులును సన్మానిస్తున్న ఉద్యోగులు

వనపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని డీఈఓ ఆఫీస్‌లో ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులును మాదిగ ఉద్యోగుల సమాఖ్య, భాషా పండితుల సంఘం నాయకులు శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గద్వాల కృష్ణ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను త్వరగతిన పరిష్కరించి విద్యార్థులకు పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అమర్‌నాథ్, ఎస్ఎల్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కవి గిరిరాజాచారి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఎస్ఎల్‌టీఏ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజనగరం రాజేష్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా కన్వీనర్ శిరీన్, నాయకులు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన




అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో శుక్రవారం పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. షాపులు, ఇళ్ల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు. అడ్డాకులలో కార్మికుల సమ్మెకు రాచాల సర్పంచ్ తిరుపతయ్య యాదవ్ సంఘీభావం ప్రకటించి రూ.5వేల నగదును కార్మికులకు అందజేశారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

- ఓవర్ ఫ్లోతో నీటి వృథా
- దెబ్బతింటున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు

అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరువలో ఉంది. స్థానిక దశమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ప్రతి నిత్యం ఓవర్ ఫ్లో ద్వారా తాగునీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో ట్యాంకు లోంచి నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. విషయాన్ని మున్సిపల్ అధికారులకు, పాలక వర్గానికి తెలిసిన అరికట్ట లేకపోతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, దశమి కట్ట వద్ద ప్రతి నిత్యం నీటి వృథా జరుగుతున్నా మిషన్ భగీరథ అధికారులు, వాటర్ లైన్‌మెన్లు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకొని నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

దశమికట్ట వద్ద శిథిలావస్థకు చేరిన ట్యాంక్ →



పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



పెంట్లవెల్లి: మండలంలోని మాధవ స్వామినగర్‌లో సర్పంచ్ లక్ష్మీదేవమ్మ రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్, ఏఈ సాయిరాం, వెంకటేశ్వర్లు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే..

కోయిల్‌కొండ: రైతుల సంక్షేమం కోరేది సీఎం కేసీఆర్ అని జెడ్పీటీసీ విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంకిళ్ల రైతువేదికలో నిర్వహించిన రైతుసదస్సులో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఒక రైతుబిడ్డ అయినందున రైతుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, రైతులకు 24గంటల విద్యుత్, రైతుబంధు, బీమా ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, భీంరెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రఘునాథ్ పాల్గొన్నారు.

